ప్రజాశక్తి
ఆదివారం 28 ఏప్రిల్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఇండియా బ్లాక్‌తోనే అభివృద్ధి

- ప్రజాగళం వినిపించేవారినే చట్టసభలకు పంపండి
- ఆదివాసీలకు ద్రోహం చేసిన బిజెపి, పొత్తు, తొత్తు పార్టీలను ఓడించండి
- పిసిసి అధ్యక్షురాలు షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు
- పాడేరు, అరకులోయ, పాయకరావుపేటల్లో సభలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ శ్రేణులు



పాడేరు సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో షర్మిల, అప్పలనర్స, బుల్లిబాబు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పాడేరు, అరకులోయ విలేకరులు

ఇండియా బ్లాక్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజలకు న్యాయం జరుగుతుందని పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా షర్మిల తలపెట్టిన ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, అల్లూరి జిల్లాలోని పాడేరు, అరకులోయల్లో శనివారం బహిరంగ సభలు నిర్వహించారు. ఆయా సభల్లో షర్మిల మాట్లాడుతూ టిడిపి, వైసిపిల హయాంలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. కాంగ్రెస్, వామపక్షాలతోనే ప్రజా సంక్షేమం, ఆదివాసీల అభివృద్ధి సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్న బిజెపికి జగన్, చంద్రబాబు తొత్తులుగా మారారని విమర్శించారు. బిజెపి మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పిన జగన్ హోదా కోసం ఒక్క నిజమైన ఉద్యమమైనా చేశారా అని నిలదీశారు. రాష్ట్రానికి ఊపిరి లాంటి ప్రత్యేక హోదా, రాజధాని, పోలవరం ప్రాజెక్టు పూర్తి ఇండియా బ్లాక్‌తోనే సాధ్యమన్నారు. బిజెపితో కొట్లాడే ధైర్యం టిడిపి, వైసిపిలకు లేవన్నారు. ప్రత్యేక హోదా వచ్చివుంటే ప్రతి నియోజకవర్గంలో యాభై నుంచి వంద కొత్త పరిశ్రమలు రావడం ద్వారా యువతకు ఉపాధి లభించేదన్నారు. నష్టపోతున్న చెరకు రైతులు, కార్మికులను పట్టించుకోని వారికి ఓటు వేయొద్దన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీలకు ఈ ఎన్నికలు ఎంతో కీలకమన్నారు. అటవీ భూములను కాజేసేందుకు కుట్రలు పన్నుతున్నవారిని ఓడించాలని మిగతా 2లో..

విశాఖ నగరంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల తాకిడి

ప్రశాంతంగా పాలీసెట్

- విశాఖలో 93 శాతం, అనకాపల్లిలో 98 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, అనకాపల్లి విలేకరులు

స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విశాఖ జిల్లాలోని మొత్తం 28 సెంటర్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 13,021 అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 12,147 (93 శాతం) మంది హాజరయ్యారని పరీక్షల జిల్లా కో-ఆర్డినేటర్, విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 98 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు పాలీసెట్ సమన్వయకర్త ఐవిఎస్-ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో అనకాపల్లిలో 16 సెంటర్లు, నర్సీపట్నంలో 11 సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9670 మంది హాజరు కావలసి ఉండగా 9014 మంది హాజరయ్యారన్నారు.

కశింకోట : కశింకోట రాజీవ్ గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన మిగతా 2లో..

నేడు బీచ్ రోడ్డులో 5కె ఓటర్ల చైతన్య ర్యాలీ

▶ వార్త 2లో..

30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

▶ వార్త 2లో..

ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

▶ వార్త మెయిన్‌లో..

అనకాపల్లి @ 15,96,916

- తుది జాబితాతో పెరిగిన ఓటర్ల సంఖ్య
- మహిళలే అధికం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అనకాపల్లి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓటర్ల సంఖ్య 15,96,916కు చేరింది. సార్వత్రిక ఎన్నికలకు కొత్త ఓట్ల నమోదు కోసం ఈ నెల 16 వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. దీంతో ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా కంటే 15,780 మంది పెరిగారు. జనవరి 22 నాటికి ఓటర్లు 15,81, 136 మంది వుండగా, శుక్రవారం ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన కొత్త ఓటర్ల జాబితా ప్రకారం 15,96,916 మందికి పెరిగారు. వీరిలో పురుషులు 7,79,913 మంది, మహిళలు మిగతా 2లో..

లోక్‌సభ పరిధిలో ఓటర్ల తుది జాబితా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
అనకాపల్లి	1,03,088	1,10,621	2,13,714
చోడవరం	1,05,614	1,11,863	2,17,484
మాడుగుల	92,102	96,886	1,88,989
పెందుర్తి	1,52,592	1,54,948	3,07,545
యలమంచిలి	1,00,407	1,05,978	2,06,394
పాయకరావుపేట	1,23,363	2,27,379	2,50,744
నర్సీపట్నం	1,02,747	1,09,295	2,12,046
మొత్తం	**7,79,913**	**8,16,970**	**15,96,916**

ముస్లిములపై మోడీ దురహంకార వ్యాఖ్యలు హేయం

- ప్రజా సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముస్లిం మైనారిటీలపై ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రధాని మోడీ దురహంకార వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, ఈ వ్యాఖ్యలను దేశ ప్రజలంతా ఖండించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనిలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లిం మైనారిటీలపైన చేసిన ప్రసంగాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి అస్రఫ్ మాట్లాడుతూ ప్రధాని హోదాలో మోడీ ఇటువంటి ప్రసంగం చేయటం ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్టేనని, ఎలక్షన్ కమిషన్ వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, మైనారిటీ, మహిళలపైన

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆవాజ్, పలు ప్రజా సంఘాల నాయకులు

దాడులు పెరిగాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిదికాదని అన్నారు. ఇతర సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ చెప్పిన లెక్కలు పూర్తిగా అవాస్తవమని, ఏ మతంలో కూడా జనాభా పెరుగుదల ప్రమాదకర స్థాయిలో లేదని, అన్ని మతాల జనాభా ఇంచుమించు ఒకే రేషియోలో పెరుగుతోందని తెలియజేశారు. ప్రభుత్వం బాధ్యత మరిచిపోయి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రజలకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అరకులోయ సభకు భారీగా తరలివచ్చిన ఇండియా బ్లాక్ పార్టీల కార్యకర్తలు

ఇండియా బ్లాక్‌తోనే అభివృద్ధి

పిలుపునిచ్చారు. ఆదివాసీ ప్రాంతంలోని ఖనిజ సంపదనంతటినీ అదానీపరం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని తెలిపారు. రాజ్యాంగం లేకపోతే గిరిజన ప్రాంతంలో రక్షణ ఉండదని, 1/70 చట్టం, పీసా చట్టం కనుమరుగవుతాయని తెలిపారు. మనువాదం కావాలా ? అంబేద్కర్ రాజ్యాంగం కావాలా ? అన్న విషయాన్ని ఆదివాసీలు ఆలోచించాలన్నారు. ఇండియా బ్లాక్‌కు ఓటేసి గెలిపిస్తే గిరిజనులకు రక్షణ ఉంటుందన్నారు. అవినీతి అభియోగాలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను ఆదివాసీలు ఓడించాలన్నారు. అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ బిజెపి చెబుతోందని, రాజ్యాంగం మోడీ తాత ముత్తాతలు చేసింది కాదని అన్నారు. బిజెపి అరాచకాలపై ఇండియా బ్లాక్ తిరుగుబాటు చేస్తోందన్నారు. తనను అరకు ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యలపై చట్టసభల్లో పోరాడుతానని అన్నారు. అరుకు ప్రాంతాన్ని టూరిజం హబ్, ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. పాడేరులో బిఇడి కళాశాల కార్యరూపం దాల్చలేదని, అరకులో డైట్ కళాశాల ఊసే లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి నకిలీ గిరిజనురాలైన కొత్తపల్లి గీతకు టికెట్ ఇచ్చి ఎంపీగా నాడు గెలిపించారని, ఇప్పుడు మళ్లీ అదే జగన్మోహన్ రెడ్డి ఆమె గిరిజనురాలు కాదని చెబుతున్నారని, వారి స్వార్థపూరిత విధానాలను అర్థం చేసుకోవాలని అన్నారు. నకిలీ గిరిజనులను ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం పోరాడుతున్న తనపై జగన్ సర్కారు తీవ్ర నిర్బంధం విధించిందన్నారు. జీవో నెంబర్ 3పై ఏ ఎంపీ, ఎమ్మెల్యేలూ చేయని విధంగా తాను సుప్రీంకోర్టులో కేసు వేశానన్నారు. కొత్తపల్లి గీతపై రిటర్నింగ్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేసినా స్టే ఉందని చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఎన్నికలు నకిలీ గిరిజనులకు, నిజమైన గిరిజనులకు మధ్య జరుగుతున్నాయని అన్నారు.

పాడేరు కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ బలపరిచిన తనను గెలిపించాలని కోరారు. గిరిజన హక్కులకు రక్షణ తమతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి మాట్లాడుతూ ఆదివాసీల భవిష్యత్తు కోసం తమను గెలిపించాలని కోరారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో పాయకరావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావు, కాంగ్రెస్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, అమర్, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. అరకులోయ, పాడేరుల్లో జరిగిన సభలకు పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. నేతల ప్రసంగాలు వారిని ఆలోచింపజేశాయి. గిరిజన కళాకారుల థింసా నృత్యం, ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రశాంతంగా పాలీసెట్

పాలీసెట్ పరీక్షకు మొత్తం 300 మంది విద్యార్థులకుగాను 288 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష పర్యవేక్షణ అధికారిగా ఐ.ఉమాలలిత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె శివ, జనరల్ హెడ్ ఎస్.గణేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శివరాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానికంగా కేటాయించిన ఆరు పరీక్షా కేంద్రాల్లో శనివారం పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 1043 మంది విద్యార్థులకుగాను 951 మంది (91 శాతం) పరీక్షకు హాజరైనట్లు ఇంఛార్జి ప్రిన్సిపల్ తెలిపారు. పరీక్షా కేంద్రాలైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 188 మందికిగాను 174 మంది, ఎపి బాలికల గురుకుల పాఠశాలలో 144 మందికి 127 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 219 మందికి 201 మంది, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 146 మందికి 129 మంది, కెడార్ హైస్కూల్‌లో 181 మందికిగాను 168 మంది, ప్రైమరీ స్కూల్‌లో 165 మందికిగాను 152 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి @ 15,96,916

8,16,970 మంది, ఇతరులు 33 మంది వున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా వున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, పెందుర్తి నియోజకవర్గాలున్నాయి. పెందుర్తిలో అధికంగానూ, మాడుగులలో తక్కువ మంది ఓటర్లు నమోదయ్యారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఈ జాబితా ప్రాతిపదిక కానుంది.

ముస్లిముల రిజర్వేషన్‌పై చంద్రబాబు వైఖరి తెలపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ముస్లింలకు తీవ్ర వ్యతిరేకత కలిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్రంలోని బిజెపితో జట్టు కట్టిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈ రిజర్వేషన్లపై తన అభిప్రాయాన్ని చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎ రెహమాన్ డిమాండ్ చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎపిలో ముస్లింలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావన్నారు. మతం స్వగతమని, ముస్లింలలో బాగా వెనుకబడిన తరగతుల వారికి, ఈ రిజర్వేషన్లు అమలవుతు న్నాయన్నారు. కామన్ సివిల్ కోడ్ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు వెళ్లడం తగదన్నారు. గల్ఫ్ దేశాల పర్యటనలో మోడీ ముస్లిం దేశాల నేతలతో చెట్టాపట్టా లేసుకుని తిరుగుతారని, ఇండియా విషయానికి వచ్చేటప్పటికీ వ్యతిరేక భావనతో ఉంటారని ఆరోపించారు. మతమేదైనా అందరం భారతీయులమేనని పేర్కొన్నారు. పాలకులు అందరి పట్ల సమన్యాయంతో ఉండాలని తెలిపారు. గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందని తెలిపారు. సేవా రంగంలో 8 నుండి ఒకటో స్థానంకు చేరుకుందన్నారు. బస్సు యాత్ర తర్వాత రాష్ట్రంలో వైసిపి పవనాలు బలంగా వీస్తున్నాయని పేర్కొన్నారు. తాము మళ్లీ అధికారాన్ని చేపట్టబోతున్నట్లు రహమాన్ జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు, షరీఫ్,బాబ్జి పాల్గొన్నారు

నేడు 5కె ఓటర్ల చైతన్య ర్యాలీ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 28న ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్.కె. బీచ్‌లో సుమారు 5 వేల మందిని భాగస్వామ్యం చేస్తూ 5 కె రన్ ఫర్ ఓట్ అనే పేరుతో ఓటరు చైతన్య ర్యాలీని నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లిఖార్జున శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్థానిక స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని చేపడుతున్నా మన్నారు. ఆర్.కె. బీచ్ లోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి పామ్ బీచ్ వరకు సాగుతుందని, సంబంధిత విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఓటర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈ నెల 30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని, 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి 30న జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జడ్పీ సిఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు 2,5 స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు 4,3, మధ్యాహ్నం 12 గంటలకు 1,6,7 స్థాయి సంఘ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సభ్యు లందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

మూడు రాజధానులు ఏవీ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: మూడు రాజధానులని నమ్మిస్తూ, రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నట్టేట ముంచారని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్ విమర్శించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన వైసిపి అరాచక పాలనపై చార్జ్ షీట్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇసుక మాఫియా చేసి, భవన నిర్మాణ రంగాన్ని జగన్ కుదేలు చేశారన్నారు. ఫలితంగా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు ఏ ప్రయోజనం వైసిపి ప్రభుత్వం లో అందలేదని, డీజిల్ రాయితీ పెంచలేదన్నారు. అమ్మ ఒడికి రూ.15 వేలు ఇస్తే, నాన్న బుడ్డికి రూ.కోట్లు కొట్టేశారని ఎద్దేవా చేశారు. రిషికొండని బోడిగుండు చేసి, ప్రకృతిని పూర్తిగా నాశనం చేశారన్నారు.

వైసిపి మేనిఫెస్టోలో ఎస్‌సి, ఎస్‌టిలకు చోటేదీ?

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఎస్‌సి, ఎస్‌టిలకు చోటేదీ అని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నా ఎస్‌సి, నా ఎస్‌టి అనే నైతిక హక్కు జగన్‌కు లేదని పేర్కొన్నారు. రద్దయిన ఎస్‌సిల 20 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని కనీసం ప్రస్తావించలేదని, ఇక ముందు తమ ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు డేడ్ బాడిలను డోర్ డెలివరీలు, శిరోముండనాలకు పాల్పడకుండా చూస్తామని భరోసా ఇవ్వలేక పోయారని విమర్శించారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణ విధానంపై మేనిఫెస్టోలో ప్రస్తావన లేదని, ఉప ప్రణాళిక నిధుల వినియోగం ఊసే లేదని తెలిపారు. అన్యాక్రాంతమైన అసైండ్ భూములకు రక్షణ ప్రణాళిక ప్రకటించలేదని పేర్కొన్నారు.

మరింత లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజలకు మరింత లబ్ధి చేకూరేలా తయారుచేశారని ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఇస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగించడమే కాకుండా ప్రజలకు మరింత ఎక్కువ లబ్ధి చేకూరేలా మేనిఫెస్టోలో చేర్చడం అద్భుతమన్నారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాస్, కటుమూరి సతీష్, ఆనంద్ సింగ్, కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్కయ్యపాలెంలో షర్మిల బహిరంగ సభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఆదివారం విశాఖ వస్తున్న సందర్భంగా ఉదయం 9 గంటలకు అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పి.సత్యారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ సభలో విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వెంకట్రావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -తగరపువలస : టిడిపిలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన జివిఎంసి ఒకటో వార్డుకు చెందిన దళిత సంఘం నాయకులు కీర్తిశేషులు రవ్వ వెంకట్రావు అందించిన సేవలు మరువలేనివని పలువురు పార్టీ నాయకులు కొనియాడారు. స్థానిక ఒకటో వార్డు పార్టీ కార్యాలయంలో శనివారం రవ్వ వెంకట్రావు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు టి.సూరిబాబు, పార్టీ నాయకులు వానపల్లి సత్య, డి.వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు చిలకా నరసింగరావు, పిట్టా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్ విజయాన్ని కాంక్షిస్తూ జివిఎంసి మూడో వార్డులోని పలు ప్రాంతాల్లో శనివారం టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి 2, 3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, మాజీ కౌన్సిలర్లు గొలగాని నరేంద్ర కుమార్, పి.లక్ష్మీకుమారి, పార్టీ నాయకులు గంటా నూకరాజు, ఎం.సంజీవ్‌కుమార్, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో శనివారం టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ ఇంటింటి ప్రచారం నిర్వహించారు, సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ, మాజీ అధ్యక్షులు కాల నగేష్‌కుమార్, టిడిపి నాయకులు ఎం.నందేశ్వరరావు, కె.దామోదర, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అడిషనల్ డిజిపి ఎ.రవిశంకర్ ఆదేశాలతో జాయింట్ సీపీ పకీరప్ప నగరంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. రుషికొండ, వాడపాలెంలోని జెడ్‌పి హైస్కూల్ తదితర కేంద్రాలను పరిశీలించి, మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ముఖ్యంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరును తనిఖీ చేశారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రత చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ముస్లిములపై మోడీ దురహంకార వ్యాఖ్యలు హేయం

(మొదటి పేజీ తరువాయి..)

అందించవలసిన అభివృద్ధి ఫలాలు అందించలేక వేరే పార్టీలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ఆవాజ్ అధ్యక్షులు ఎండి ఆయూబ్ మాట్లాడుతూ బిజెపి మూలాలుగా ఉన్న ఆర్ఎస్ఎస్, సంఘ పరివార్ బ్రిటిష్ వారికి పూర్తిగా మద్దతు పలికి స్వతంత్ర సమరయోధులకు వ్యతిరేకంగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. బిజెపి కార్పొరేట్ సేవలో మునిగి తేలుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి వైద్యం, విద్య, రహదారులు, ఉద్యోగ ఉపాధి కల్పన ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేయలన్నారు.

భీమిలి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని అన్నవరం, పెదనాగమయ్యపాలెం, బోడమెట్టపాలెం, ముద్దాడపేట తదితర గ్రామాల్లో ఇండియా వేదిక బలపర్చిన భీమిలి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మ రాజు (హసిని వర్మ) శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరుగు ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ లోక్ సభ అభ్యర్థిగా పి.సత్యారెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ఏడాదిలోనే 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, చదువుకున్న నిరుద్యోగ యువతకు నెలకు రూ.8,500 భృతి ఇస్తూ వృత్తి పరమైన శిక్షణ ఇస్తామని, ఇల్లు లేని వారికి రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం, రూ.2లక్షల వరకు రైతు రుణ మాఫీ, వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పింఛను, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. 2024 కాంగ్రెస్ గ్యారెంటీలు పేరుతో కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాదం మహేష్, కె.జగన్నాధం పాల్గొన్నారు.

జీవిఎంసి 3, 4 వార్డుల్లో మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకట వర్మ రాజు సతీమణి స్వప్న, మహిళా కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పద్మనాభం : పద్మనాభం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకట వర్మ రాజు శనివారం ప్రచారం చేశారు. బీఆర్.తాళ్లవలస, లింగన్నపేట, కోరాడ, మజ్జిపేట, రేవిడి, పాండ్రంగి, బోని, అనంతవరం, పాత కొవ్వాడల మీదుగా పద్మనాభం చేరుకున్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి గడపకూ వెళ్లి కరపత్రాలను పంచిపెడుతూ ప్రచారాన్ని కొనసాగించారు. ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు.

పెదనాగమయ్యపాలెంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వర్మ రాజు

నేరాలు ఘోరాలు

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామంలో గురువారం రాత్రి వివాహితను హత్య చేసిన కేసులో ఆమె భర్తను పోలీసులు శనివారం అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్లు కొత్తకోట సిఐ ఎల్. అప్పలనాయుడు తెలిపారు. పొట్టి దొరపాలెం గ్రామానికి చెందిన అన్నపూర్ణ గురువారం రాత్రి మృతి చెందడంపై అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు విచారణ చేసిన పోలీసులు అన్నపూర్ణ భర్త రామల సత్తిబాబు హత్యచేసినట్లు నిర్ధారించి ఆయన్ను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. కోర్టు రిమాండ్ విధించడంతో సత్తిబాబును విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య ప్రియుడు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ పంచాయతీ శివారు సాలాపువానిపాలెం గ్రామంలో భర్తను భార్య ప్రియుడు హత్య చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సాలాపు వానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు శ్రీనివాసరావు దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాసరావుకు ఐదేళ్ల క్రితం గాజువాక మండలం మంగళపాలెం గ్రామానికి చెందిన అమరపిన్ని భాగ్యలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భాగ్యలక్ష్మి అదే గ్రామానికి చెందిన గల్లా రవికుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో మూడేళ్లగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీనివాసరావు భాగ్యలక్ష్మిల పెళ్లిరోజు సందర్భంగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ సంగతి భాగ్యలక్ష్మి తన ప్రియుడితో చెప్పింది. ఇది ఇలా ఉండగా, శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీనివాసరావు పొలానికి నీరు పెట్టి తిరిగి వస్తుండగా, భాగ్యలక్ష్మి ప్రియుడు గల్లా రవికుమార్, గరికపాటి శ్రీహరి అలియాస్ హరీష్ అనే వ్యక్తిని వెంట పెట్టుకుని వెళ్లి శ్రీనివాసరావు తలపై మంచం కోడుతో బలంగా కొట్టారు. తలకు తీవ్ర గాయమై శ్రీనివాసరావు పెద్దగా కేకలు వేయడంతో, కుటుంబ సభ్యులు, తండ్రి అప్పారావు మరి కొంతమందితో కలిసి పొలంలోకి వెళ్లి చూడగా, శ్రీనివాసరావు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. దీంతో శ్రీనివాసరావును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడు తండ్రి సాలాపు అప్పారావు ఫిర్యాదు మేరకు స్థానిక సిఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి, నిందితులు గల్లా రవికుమార్, గరికపాటి శ్రీహరిని సబ్బవరం జోడుగుళ్ల జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అమృతరావుకు నివాళి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు తమనంపల్లి అమృతరావు 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్మృత్యంజలి స్థూపం వద్ద ఉన్న అమృతరావు విగ్రహానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్ఆర్‌టియుసి నాయకులు వై.మస్తానప్ప ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, విశాఖ కలెక్టరేట్ వద్ద అమృతరావు నిరాహారదీక్ష, 32 మంది అమరవీరుల త్యాగం విశాఖ స్టీల్ నిర్మాణంలో చారిత్రాత్మక ఘట్టాలని పేర్కొన్నారు. త్యాగాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మాలని చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి, మాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు అంతం'

ప్రజాశక్తి -గోపాలపట్నం : రాష్ట్రంలో అరాచక పాలన అంతం కానుందని విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనపై విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, మిత్రపక్షాలైన జనసేన బిజెపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'అరాచక పాలన అంతం' పేరు మీద ఛార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూ.13 లక్షల కోట్ల అప్పును రాష్ట్ర ప్రజల నెత్తిన జగన్మోహన్‌రెడ్డి పెట్టారన్నారు. సగటు వ్యక్తిపై రూ.2.5 లక్షల చొప్పున అప్పు ఉందని తెలిపారు. ల్యాండ్, శాండ్, మైనింగ్ దోపిడీ ద్వారా ప్రభుత్వ ఖజానకు రూ. కోట్లల్లో గండి కొట్టారని విమర్శించారు. సలహాదారులు నియామకం ద్వారా ప్రజాధనాన్ని వృథా చేశారని తెలిపారు. దశలవారీ మద్యపాన నిషేధం అని చెప్పి జగన్‌రెడ్డి జె బ్రాండ్ ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన కన్వీనర్ ప్రశాంతి, దాడి రమేష్, కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్ పాల్గొన్నారు.

సూపర్ 6 పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి వారి పంచాయతీ పరిధిలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ 6 పథకాల గురించి వివరించారు. భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావును, ఎంపీగా ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిన్నింటి సన్యాసిరావు, బంటుపల్లి శ్రీనివాసరావు, సత్తిబాబు, శ్రీను, బుజ్జి, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

జూ పార్కుకు కొత్త నేస్తాలు రాక

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు కొత్త నేస్తాలు వచ్చాయి. వీటిలో జిరాఫీల జంట ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కలకత్తాలో ఉన్న అలీపూర్ జూ పార్కు నుంచి ఒక జత జిరాఫీలను, ఏషియన్ వాటర్ మానిటర్ లిజర్డ్స్ రెండు జతలు, ఒక జత స్కార్లెట్ మకావ్స్‌ను శనివారం ఉదయం జూ అధికారులు తీసుకొచ్చారు. వైజాగ్ జూ పార్కు నుంచి ఒక ఆడ తెల్లపులి, ఒక జత తోడేలు, ఐదు ఇండియన్ వైల్డ్ డాగ్స్, ఒక జత రింగ్ టెయిల్డ్ లెమర్, ఒక జత బ్లాక్ స్వాన్, రెండు జతల హాగ్ డీర్, ఒక జత హైనాలను అలీపూర్‌జూ పార్కుకు అప్పగించారు. జూ అధికారులు, సెంట్రల్ జూ అథారిటీ సహకారంతో జంతు మార్పిడి విధానం ద్వారా కొత్త జంతువులను తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. జూ పార్కులో ఇదివరలో ఉన్న రెండు జిరాఫీలు తీవ్ర అనారోగ్య కారణాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. కొత్తగా వచ్చిన జంతువులను జూ క్వారంటైన్‌లో కొద్దిరోజుల పాటు ఉంచనున్నారు. అనంతరం వీటిని సందర్శకులు వీక్షించడానికి అనువుగా ఎన్‌క్లోజర్‌లో ప్రవేశపెట్టనున్నట్లు జూ క్యూరేటర్ తెలిపారు.

అరుదైన గుండె వ్యాధికి ఆధునిక చికిత్స

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్య బృందం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రాణపాయ స్థితిని కలిగించే అరుదైన గుండె వాల్ లీకేజీ వ్యాధితో బాధపడుతున్న 55 ఏళ్ల వ్యక్తికి ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో హృద్రోగ వైద్య బృందం ట్రై డిస్క్ అంబ్రెల్లా పరికరం సహాయంతో విజయవంతంగా కవాటాన్ని సరిచేశారు. ఈ సందర్భంగా ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ పాణిగ్రహి మాట్లాడుతూ, హార్ట్ ఫెయిల్యూర్, ఎనీమియా రోగంతో వచ్చిన రోగికి ముందుగా ఓపెన్ హార్ట్ సర్జరీ జరిపామన్నారు. సర్జరీ అనంతరం త్రీడి ఎకో, సిటి పరీక్షలు జరపగా గుండెలో మెడియల్ సైట్లో, యాంటీరో లాటరల్ సైట్‌లో కవాటాలు లీక్ అయినట్లు గుర్తించామని చెప్పారు. అత్యంత ప్రమాదకరమైన లీకులను శస్త్ర చికిత్స లేకుండా విజయవంతంగా మూయగలిగామని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యులు డాక్టర్ బారువా, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ చక్రధర్, డాక్టర్ అనురాధ, డాక్టర్ శశాంక్, డాక్టర్ సునీల్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ బాలకృష్ణ, సిఇఒ రామచంద్ర, కార్పొరేట్ రిలేషన్స్ డిజిఎం విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : సిఐటియు నాయకులు కణితి అప్పలరాజు కుమారుడు కణితి దుర్గాప్రసాదశివ ఏడవ వర్ధంతి సందర్భంగా స్థానిక సీతానగరంలో పేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పులి రమణారెడ్డి, 75 వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు చేతుల మీదుగా మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా నగిరెడ్డి రామారావు మాట్లాడుతూ, కణితి అప్పలరాజు తన కుమారుని జ్ఞాపకార్థం ఏటా పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. పాల వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, కె.దీనబంధు, సిఐటియు సెక్రటరీ యు.రామస్వామి, నక్క రమణ, సిమునిరి శ్రీను, డి.వెంకట్రావు, పి.గురప్ప, ద్వారపూడి గురునాథ, సిసెట్టి అప్పారావు, లోకేష్, రాజా వెంకటప్ప, లాచా తదితరులు పాల్గొన్నారు.

కణితి దుర్గాప్రసాద్ శివ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'గుంటూరు'కు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న గుంటూరు వెంకట నరసింహమూర్తికి మద్దతుగా ఆయనభార్య భారతి శనివారం సరిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కార్మికులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటికే బంధువులను, స్నేహితులను, ఆత్మీయులందరినీ కలిశామని, అందరూ మద్దతు ఇస్తామని చెప్పారని తెలిపారు. సొంత గ్రామస్తులు కూడా మద్దతిస్తే ఆయన గెలుపునకు తిరుగుండదని అభిప్రాయపడ్డారు. ఉపాధి హామీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

14వ వార్డులో లక్ష్మీనారాయణ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవిఎంసి 14వ వార్డులో జైభారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వి.వి.లక్ష్మీనారాయణ ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్తున్న క్రమంలో ప్రజలందరూ ఎంతో ఆప్యాయంగా పలకరించడం, తమ ఓటును టార్చ్‌లైట్‌పై వేస్తామని చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఉత్తర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ పదవికి బెహరా రాజీనామా

ప్రజాశక్తి- గోపాలపట్నం : జీవిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు, గోపాలపట్నం ప్రాంతానికి చెందిన వైసిపి నాయకుడు బెహరా భాస్కరరావు తన జీవిఎంసి కో-ఆప్షన్ సభ్యుని పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మేయర్ హరి వెంకట కుమారికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. తన ఆరోగ్యం సరిగా లేనందున రాజీనామాను అంగీకరించాలని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో బెహరా భాస్కరరావు ఇటువంటి నిర్ణయం తీసుకోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

విస్తృతంగా నాగమణి ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగోతి నాగమణి ఆనందపురం మండలంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఉదయం పైడా కాలేజీలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని అనంతరం మండలంలోని దుక్కవానిపాలెం, నీలకుండీలు, సొంట్యాం, గండిగుండం గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలిసి తనకు ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. స్థానికురాలినైన తనకు నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందన్నారు. నియోజకవర్గ ఆడపడుచునైన తనను గెలిపిస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
ఆదివారం
28 ఏప్రిల్ 2024

కలం మాట

ఓట్ల పండుగ

ఓట్ల పండుగని సంబరపడిపోయే
ఓటరు మహాశయులారా మీరే కదా !
పాలకుల్ని మనమే కదా ఎన్నుకొనేది?
భవిష్యత్తును కూడా మనమే నిర్ణయించేది?
అమ్మకానికి ఓట్లున్నంత కాలం !
ప్రజల తలరాత నెవ్వడు మార్చగలడు?
ఓటుకు నోటిచ్చుకున్న నాయకుడు !
ప్రజల సొమ్ము దోచుకొనడా నెగ్గినంతట?
అందుకే ఓటరులంతా విజ్ఞత చూపించాలి !
నీతి నిజాయితీగల నాయకున్నెన్నుకోవాలి !
మందు మాకులు మన కొద్దు!
భావితరాల భవిష్యత్తే మనకు ముద్దు!

కింతలి సన్యాసిరావు,
విశాఖపట్నం,
మొబైల్ : 99085 35185.

వంద శాతం ఓటింగే లక్ష్యం

- తూర్పు నియోజకవర్గ ఆర్‌ఒ మయూర్ అశోక్
- యోగాసనాలతో ఓటర్లలో చైతన్యం

అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఆర్‌ఒ, జెసి మయూర్ అశోక్, తదితరులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : వందశాతం ఓటింగే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని, దీనిపై ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత ఎన్నికల అధికారులను తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్‌అశోక్ సూచించారు. అన్ని వర్గాలనూ భాగస్వాములను చేసి, గతం కంటే ఎక్కువ పోలింగ్ శాతం నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. శనివారం ఉదయం స్వీప్ కార్యక్రమంలో అధికారులు, ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలను ఓటర్లు తెలుసుకోవాలని, చైతన్యం కలిగి ఉండాలని హితవు పలికారు. ఓటరు హెల్ప్‌లైన్, సాక్షం, సువిధ యాప్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవ్లాన్నారు.

పోటీ అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌ను అనుసరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో అందరూ భాగస్వాములు కావాలని, ఓటర్లంతా స్వచ్ఛందంగా ఓటేసేందుకు ముందుకు వచ్చి శతశాతం పోలింగ్ లక్ష్యానికి సహకరించాలని కోరారు. అనంతరం అధికారులు, ఓటర్లతో కలిసి వుడా పార్కులో యోగాసనాలు వేసి ఓటర్లలో చైతన్యం, స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు. తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, స్వీప్ నోడల్ అధికారులు, ఓటర్లు పాల్గొన్నారు.

పోలింగ్ రోజున దుకాణాలు, సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వచ్చేనెల 13న దుకాణాలు, సంస్థలు, కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా సెలవు ప్రకటిస్తున్నట్లు ఎపి కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయాచోట్ల పనిచేసే వారికి తప్పకుండా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల వేతనంలో కోత విధించినా, సెలవు ఇవ్వకపోయినా యజమానికి జరిమానాతోపాటు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వమిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరూ విధిగా ఓటేయాలని కోరారు.

పశ్చిమంలో అపరిష్కృత సమస్యలెన్నో..?

విశాఖ మహానగరంలో అంతర్భాగమైన పశ్చిమ నియోజకవర్గంలో భౌగోళికంగా వైవిధ్యభరితమైన పరిస్థితులున్నాయి. ఎక్కువ భాగం పారిశ్రామిక ప్రాంతం కాగా, కొండవాలు ప్రాంతాలు కూడా ఉన్నాయి. షిప్‌యార్డు, డాక్‌యార్డు, హెచ్‌పిసిఎల్ వంటి జాతీయ సంస్థలు, ఎన్ఎడి, ఎన్ఎస్‌టిఎల్, విశాఖ ఎయిర్‌పోర్టు వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కోరమండల్ ఫెర్టిలైజర్స్ వంటి ప్రతిష్టాత్మక ఎరువుల కంపెనీ, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం ఇక్కడున్నాయి. నియోజకవర్గం ఆవిర్భవించి, పదిహేనేళ్లు పూర్తవుతున్నప్పటికీ పంచగ్రామాల భూసమస్య అపరిష్కృతం గానే ఉంది. ఎల్‌జీ పాలిమర్స్ విషవాయువుల లీకేజీ దుర్ఘటన మాయని మచ్చలా నిలుస్తోంది.

ప్రజాశక్తి - గోపాలపట్నం, ములగాడ

- కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు కరువు
- పలు కాలనీలు కాలుష్యంతో పరేషాన్
- పంచగ్రామాల భూసమస్యతో ప్రజలకు ఇక్కట్లు
- అమలుకు నోచుకోని టిడిపి, వైసిపి నేతల హామీలు

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో పెందుర్తి నుంచి విడిపోయి విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఆవిర్భవించింది. పూర్తిగా విశాఖ నగర పరిధిలోనే ఉండి, ప్రస్తుతం నాలుగోసారి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న పశ్చిమంలో 2,75,225మంది ఓటర్లున్నారు. వీరిలో1.36 లక్షల మంది పురుషులు, 1.39 లక్షల మంది మహిళలు ఉన్నారు.

2009లో ఏర్పడిన పశ్చిమ నియోజకవర్గంలో వరుసగా నాలుగోసారి పి.గణబాబు పోటీలో ఉన్నారు. తొలిసారి జరిగిన ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థి గణబాబుపై కాంగ్రెస్ అభ్యర్థి మళ్లవిజయప్రసాద్ గెలుపొందగా, 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి దాడి రత్నాకర్‌పైనా, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మళ్ల విజయప్రసాద్‌పైనా టిడిపి అభ్యర్థిగా గణబాబు విజయం సాధించారు. 2024లో ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబు టిడిపి తరపున మళ్లీ పోటీపడుతూ హ్యాట్రిక్ కోసం చూస్తుండగా, వైసిపి తరపున ఆడారి ఆనందకుమార్, ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ అభ్యర్థి అత్తిలి విమల ప్రధానంగా పోటీలో ఉన్నారు. వీరిలో ఎవరిని విజయం వరిస్తుందో చూడాలి.

అపరిష్కృతంగా పంచగ్రామాల భూసమస్య

సింహాచలం దేవస్థానాలకు సంబంధించి పంచగ్రామాల భూ సమస్య దశాబ్దాలుగా అపరిష్కృతంగానే ఉంది. ఎన్నికల అజెండాగా దీన్ని పెట్టుకుని, ఓటింగ్‌కు వెళ్లిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు, సమస్య పరిష్కారానికి మాత్రం చొరవ చూపలేదు. టిడిపి గెలిచిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఎయులో నిర్వహించిన తొలికేబినెట్‌లో వందరోజుల్లోనే సమస్య పరిష్కరిస్తామని ప్రకటించినా అమలు కాలేదు. వైసిపి ప్రభుత్వం కూడా తామేమీ తక్కువ కాదన్నట్లు హామీలిచ్చి లబ్ధిపొందినప్పటికీ, కమిటీలు, జిఒలతో కాలయాపన చేస్తూ, సమస్యలను జటిలం చేసిందే తప్ప పరిష్కరించలేదని బాధితులు వాపోతున్నారు. దీంతో పంచగ్రామాల్లో కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను కనీసం మరమ్మతులు చేసుకోలేక, అత్యవసరమైనా అమ్ముకునే పరిస్థితిలేక, అసలు భూమి తమకు ఉందో, లేదో తెలియని అగమ్యగోచర పరిస్థితుల్లో బాధితులు తల్లడిల్లుతున్నారు. ముఖ్యంగా గోపాలపట్నం కొండపైన లక్ష్మీనగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో వర్షాల సీజన్‌లో కొండవాలు ప్రాంతాల్లో ఏళ్లనాటి శిథిలమైన ఇళ్లలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక నగరీకరణ నేపథ్యంలో 89వ వార్డు శివారు సంతోష్‌నగర్‌లో రైతులసాగులో ఉన్న భూములను అమ్ముకుని అవసరాలు తీర్చుకుందామన్న బాధితుల ఆశల కలగానే మిగిలిపోయాయి.

మాయని మచ్చలా ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన

ఇక గోపాలపట్నం ప్రాంతంలో 500 మంది రెగ్యులర్, వెయ్యిమందిదాకా ఒప్పంద కార్మికులతో నిర్వహించిన ఎల్‌జి పాలిమర్స్‌లో 2020 మే 7నాటి విషవాయువుల విడుదల దుర్ఘటన విశాఖపట్నం నగరాన్ని విషాదంలోకి నెట్టేసింది. ఈ ఘటనలో 12 మంది మృతిచెందగా.. వారికి ఒక్కొక్కరికీ రూ.కోటి పరిహారమిచ్చి యాజమాన్యం, ప్రభుత్వం చేతులు దులుపుకున్నాయి. ఈ దుర్ఘటనలో వెంకటాపురం, వెంకటాద్రి గార్డెన్ ప్రాంతాలతోపాటు పరిసర వాసులు అస్వస్థతకు గురై వెంటిలేటర్లపై అనేకమంది చికిత్సపొందారు. తుదకు ప్రాణాలతో బయటపడ్డా.. నేటికీ అనారోగ్య సమస్యలతో బతుకీడుస్తున్నారు. స్టైరీన్ విషవాయువులను పీల్చి, తర్వాత అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వీరిని పాలకులు నిర్లక్ష్యంగా వదిలేశారు.

గోపాలపట్నం మెయిన్ రోడ్డు

విషవాయువులు వెలువడిన ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ (ఫైల్‌ఫోటో)

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎక్కడ?

ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన తర్వాత వెంకటాపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తానని ప్రభుత్వం ప్రకటించగా, రాష్ట్ర మంత్రులు ఆర్భాటంగా శంకుస్థాపన కూడా చేశారు కొన్నాళ్లపాటు వెంకటాపురం మండల ప్రాథమిక పాఠశాలలో తాత్కాలికంగా వైద్యసేవలు ప్రారంభించినా, తర్వాత అవీ నిలిచిపోయాయి.

నగరం నడిబొడ్డున ఎల్‌జి పాలిమర్స్‌ను కొనసాగిస్తే ప్రమాదభరితమని భావించిన ప్రభుత్వం దీన్ని వేరే ప్రాంతానికి తరలించినా, ఇక్కడ బాధితులు, ఉద్యోగం, ఉపాధి కోల్పోయిన కార్మికుల సమస్యలను మాత్రం గాలికొదిలేసింది. రెగ్యులర్ కార్మికులను నామమాత్రపు పరిహారంతో వదిలించుకోగా, కాంట్రాక్టు కార్మికులను నిర్దయగా ఎటువంటి పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా రోడ్డున పడేసిందని ఆరోపణలున్నాయి. బాధితులు, కార్మికుల పక్షాన నేటికీ వామపక్షాలు, ప్రజా, కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నాయి.

పారిశ్రామిక ప్రాంతంలో సమస్యలెన్నో..

కోరమండల్, హెచ్‌పిసిఎల్ కంపెనీల కాలుష్యం, దుర్వాసనతో పారిశ్రామిక ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేదు. జయేంద్ర కాలనీ, మల్కాపురం కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండగా, 61 62 వార్డుల పరిధిలోని మల్కాపురం, గొల్ల వీధి ప్రాంతంలో మరిడిమాంబ కల్యాణ మండప రహదారిలో వర్షాల సీజన్‌లో ముంపు సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. ఈ రహదారిలో వీధిలైట్లు వెలిగే పరిస్థితి లేదు. నేలబోరు వేసేందుకు ఆస్కారం లేని వెంకన్నపాలెం ప్రాంతాలలో జివిఎంసి తాగునీటి సరఫరాపై ఆధారపడడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులు వీరే..

పి.గణబాబు , టిడిపి

అత్తిలి విమల (సిపిఐ)

ఆడారి ఆనందకుమార్, వైసిపి

తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో పోటీ అభ్యర్థుల నేపథ్యాన్ని పరిశీలిస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే, కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి గణబాబు వరుసగా నాలుగోసారి పోటీపడుతున్నారు. మాజీ ఎంపీ పి.అప్పలనరసింహం నుంచి కొడుకుగా రాజకీయ వారసత్వంతో పోటీలో నిలిచిన గణబాబు, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు. స్థానికుడు. టిడిపి తరపున ఇప్పటికే రెండు వరుస విజయాలను అందుకున్న గణబాబు హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు.

ఇక వైసిపి అభ్యర్థిగా బరిలో ఉన్న ఆడారి ఆనందకుమార్ కూడా తండ్రి ఆడారి తులసీరావు నుంచి రాజకీయ వారసత్వంతో 2019 ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా టిడిపి తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. తండ్రి అనంతరం విశాఖ డెయిరీ చైర్మన్‌గా, కిమ్స్ ఆసుపత్రి ట్రస్టీగా సేవలు అందిస్తూ వైసిపి అభ్యర్థిగా పోటీపడుతున్నారు.

ఇక ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ అభ్యర్థి అత్తిలి విమల ప్రజాసమస్యలపై ఉద్యమాలు, పోరాటాల నేపథ్యం నుంచి వచ్చారు. ఆమె ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలుగా సేవలందిస్తున్నారు. ప్రజానాట్యమండలి ద్వారా సిపిఐలోకి ప్రవేశించిన విమల, ప్రజల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలలో పాల్గొని జైలు జీవితం గడిపారు. కేసులు, నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు.

దోబీ అవతారమెత్తిన వాసుపల్లి

దోబీఘాట్‌లో బట్టలు ఉతుకుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఎన్నికల ప్రచారంలో పోటీ అభ్యర్థులు విభిన్న, వినూత్న రీతుల్లో ప్రచారం చేయడం పరిపాటి. దక్షిణ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సైతం తానేమీ తక్కువ కాదన్నట్లు దోభీ అవతారమెత్తారు. శనివారం పౌర గ్రంథాలయం ప్రక్కన గల దోబీఘాట్ వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా బట్టలు ఉతికి ఆకట్టుకున్నారు. నియోజకవర్గంలో ధోబిఘాట్ల అభివృద్ధికి కృషి చేశానని, రజకుల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డానని, వచ్చే ఎన్నికల్లో తనను దక్షిణ ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కళా ఆసుపత్రి ఎండి డాక్టర్ పివి రమణమూర్తిని ప్రత్యేకంగా కలిసి, తన విజయానికి, వైసిపి విజయానికి తోడ్పాటు అందివ్వాలని అభ్యర్థించారు. ద్వారకానగర్, నెహ్రూబజార్ నుంచి కళా ఆసుపత్రి, శ్రీనగర్, అమర్‌నగర్ తదితర ప్రాంతాలలో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వైసిపి ప్రభుత్వం ఏర్పాటుకు విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, దక్షిణ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో ఫ్యాన్ గాలికి టిడిపి, బిజెపి, జనసేన కూటమి కొట్టుకుపోవడం ఖాయమని వైసిపి అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.ప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ కార్పొరేటర్ జివి రవిరాజు, వైసిపి 27వ వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి, చిట్టిబోయిన శివ, మద్ది శివ, రెడ్డి అజయ్, అశోక్, గురుమూర్తి, జి అప్పలరెడ్డి కనకమహాలక్ష్మి, సింహాద్రి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎంవివి ఆత్మీయ సమావేశం

నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టో ప్రతులను ఆవిష్కరిస్తున్న ఎంవివి. బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులతో శనివారం సిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, సిఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్లస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందరికీ అర్థమయ్యేలా వివరించాలన్నారు. రానున్న 15రోజులు పకడ్బందీగా పనిచేయాలన్నారు. మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి, కరోనా వంటి కష్టకాలంలోనూ సంక్షేమానికి ఢోకా లేకుండా అమలు చేసిన విధానాన్ని ఓటర్లకు తెలియజెప్పాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి ఎంపి అభ్యర్థి బొత్స్య ఝాన్సీ, జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, గన్నమనేని వెంకటేశ్వరరావు, మొల్లి అప్పారావు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర, పివి నారాయణ, అల్లంపల్లి రాజబాబు, బోణి శివరామకృష్ణ, గోలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెలగపూడి విజయానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: జనసేన,బిజెపి, టిడిపి కూటమి బలపరిచిన విశాఖ తూర్పు నియోజక వర్గ టిడిపి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు శనివారం ఉదయం 15వ వార్డు హెచ్‌బి కాలనీ సింహాద్రి పురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు.

ఇంటింటా ప్రచారంలో తూర్పు టిడిపి అభ్యర్థి వెలగపూడి

వెలగపూడిని మళ్లీ గెలిపించండి : సుజన

విశాఖ తూర్పు ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును మళ్లీ గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సుజన విస్తృత ప్రచారం చేశారు. సిబిఐ డౌన్ రోడ్డు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బిజెపి, జనసేన, టిడిపి శ్రేణులతో ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. మహిళల నుదుట కుంకుమదిద్ది, తన భర్త వెలగపూడికి విజయతిలకం దిద్దేలా సహకరించాలని కోరారు. ప్రచారంలో వెలగపూడి సతీమణి సుజన, కుటుంబసభ్యులతోపాటు పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమ, పీతల అఖిల్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న భరత్‌కుమార్

గ్రామాల్లో వైసిపి అభ్యర్థి భరత్ కుమార్ ప్రచారం

ప్రజాశక్తి- కశింకోట

అనకాపల్లి అసెంబ్లీ వైసిపి అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శనివారం మండలంలోని చరకం, తీడ, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, అడ్డం, జి.భీమవరం, ఏనుగు తుని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలను పని ప్రదేశాల్లో కలిసి మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎంపీగా బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. తనకు ఒక్క అవకాశం కల్పిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జెడ్పిటిసి దంతులు శ్రీధర్‌రాజు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, నాయకులు వెన్నెల చిన్నదేముడు, దండి నాయుడు బాబు, రెడ్డి పోతురాజు, చిరికి సత్యనారాయణ, కచ్చల సత్తిబాబు, దుంగల నాయుడు, చిరికి పైడినాయుడు, బీపర్తు శివ, కె.నాగమణి, కన్నూరు అచ్చియమ్మ, బండారు వాసు, రేఖ నాగరాజు, రవివరపు ప్రకాష్, రేఖ లక్ష్మి, లక్ష్మణరావు, బాలరాము దండినాయుడు, చేకూరి మహేష్, అప్పలకొండ, అల్లం శంకర్, రాంపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - మునగపాక

భారీ వాహనాల అతివేగాన్ని కట్టడి చేసేందుకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని కోరుతూ మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్ వివిఎంఆర్‌డిఎ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. అనకాపల్లి- అచ్చుతాపురం రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపడుతున్న తరుణంలో వాహనదారులు పరిమితికి మించి వేగాన్ని పెంచుతున్నారని తెలిపారు. దానిని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని జగన్ కోరారు.

దర్శకులు త్రినాథరావుకు సత్కారం

ప్రజాశక్తి -అనకాపల్లి

చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాథరావు జన్మదిన సందర్భంగా శనివారం ఆయన మిత్రులు మళ్ళ సురేంద్ర స్థానిక గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద దర్శకులు మేనమామ శీలా జగన్నాథరావు మాస్టర్ ఇంటిలో సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ త్రినాథరావు ప్రస్తుతం నాలుగు సినిమాలు చేస్తున్నారన్నారు. అందులో ఒకటి చౌర్య పాఠం చిత్రం పూర్తయిందని, రెండో చిత్రం అనకాపల్లి పేరు మీద చిత్రం మొదలైందని, మూడు సందీప్ కిషన్ హీరోగా చిత్రం మొదలవుతుందని, నాలుగు దిల్ రాజ్ సారథ్యంలో నితిన్ హీరోగా చిత్రం మొదలవుతుందని తెలిపారు. ఈ చిత్రాలన్నీ విజయం సాధించాలని, అనకాపల్లికి మంచి పేరు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. దర్శకులు నక్కిన త్రినాథ్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరంలో రెండు చిత్రాలు రిలీజ్ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలా జగన్నాథం మాస్టర్, నక్కిన సురేష్, ఎస్. భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రినాథరావును సత్కరించిన మళ్ల సురేంద్ర

మహిళలు అన్ని రంగాల్లో రాణింపు

ఎపి హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

ప్రజాశక్తి- సబ్బవరం

మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎపి హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, భారత మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సాంకేతికత- వ్యాపారం - ప్రజా జీవితంలో యువతుల పాత్ర' అనే అంశంపై శనివారం వర్సిటీలో నిర్వహించిన సదస్సులో వెంకట జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు హక్కుల కోసం పోరాటం చేసిన ఎన్నో సందర్భాలు ఉన్నాయని తెలిపారు. నేడు మహిళలు వంటగది నుండి వాషింగ్‌టన్ వరకు, టీచర్ నుండి సాఫ్ట్‌వేర్ దాక, కొత్తగా వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనూ రాణిస్తున్నారని చెప్పారు. నేడు మహిళలు లేని రంగం లేదని, నేటి మహిళలు తమ సాధికారికత కంటే, దేశ సాధికారికత కోసం పనిచేసే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థుల తమ లక్ష్య సాధనలో అంకిత భావంతో పని చేస్తే సాధించలేనిది ఏమి లేదని చెప్పారు. జాతీయ మహిళా కమిషన్ జాయింట్ సెక్రటరీ ఎ.అషోలి చలాయి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సామాజిక, ఆర్థిక భద్రత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ నేటి విద్యలోనూ, ఉపాధి రంగంలోనూ మహిళల శాతం ఎక్కువ ఉన్నదని, నేటి సమాజంలో మహిళల ప్రాముఖ్యత ఎంత ఉన్నదో చెప్పేందుకు ఇది ఒక సజీవ సాక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, శ్రీకాకుళం అంబేద్కర్ వర్సిటీ నుండి వి.సుజాత, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి బి.లవన కుమార్, ఫాకల్టీ కోఆర్డినేటర్, రిజిస్ట్రార్ నందిని, విమెన్ అండ్ చైల్డ్ సెంటర్ కన్వీనర్ ఆచార్య విజయ లక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

గవిరెడ్డి వల్ల టిడిపికి తీవ్ర నష్టం

ఆ పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు

ప్రజాభీష్ట సదస్సులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని, అయితే మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అహంకారపూరిత చేష్టలతో వరుసగా ఇక్కడ టిడిపి ఓటమి చెందుతుందని, ఆయన వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాద్‌రావు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం రాత్రి ఎ.కోడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాభీష్ట సదస్సులో ఆయన ప్రసంగించారు. గవిరెడ్డిని పార్టీలో లేకుండా తరిమి కొడితేనే ఇక్కడ తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. తాను 15 సంవత్సరాలుగా నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేశానని, తను చేస్తున్న అనేక సేవా కార్యక్రమాల వల్ల తనకు ఎమ్మెల్యే టికెట్ చంద్రబాబు నాయుడు కేటాయించారని తెలిపారు. గవిరెడ్డి కుట్రల ఫలితంగా ఆ సీటును బండారుకు ఇచ్చారన్నారు. మాడుగులలో టిడిపిని నాశనం చేయడానికి గవిరెడ్డి, నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ కంకణం కట్టుకున్నారని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలు సంయమనం పాటించాలని, రెండు రోజుల్లో తాను ఏదో ఒక నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. చీడికాడ మాజీ ఎంపీపీలు పాత్రునాయుడు, కుచ్చు కళావతి, టిడిపి నాయకులు రొంగలి మహేష్, బొడ్డు అక్కునాయుడు, బండారు నరసింహనాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల నుండి అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, పైలా అభిమానులు తరలివచ్చారు.

కొణతాల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి అసెంబ్లీ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ శనివారం స్థానిక విజయరామరాజుపేటలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరామరాజు పేటకు చెందిన కసిరెడ్డి శ్రీనివాసరావు (వాసు), సత్తిబాబు ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు.

స్థానిక గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కళ్యాణ మండపంలో 81వ డివిజన్ ఇంచార్జ్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యాన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద్ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు, విల్లూరి హరి, కొణతాల అప్పలరాజు, మారిశెట్టి శంకర్రావు, బుద్ధ రాజేష్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. అనకాపల్లి మండలం సత్యనారాయణ పురం, పిసినికాడ పంచాయితీ బి ఆర్ టి కాలనీ, సుందరయ్య పేట గ్రామాల ఉపాధి హామీ కూలీలతో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడారు.

జనసేనలో చేరిక

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి వైసిపి నాయకులు భీముని తులసీరామ్, కోన పెంటయ్య, భీముని సూర్యనారాయణ, కోన శివ, సోమిరెడ్డి శేషు, మజ్జి నూకునాయుడు కుటుంబ సభ్యులు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళి, నిమ్మదాల సన్యాసినాయుడు, కలగా సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, మజ్జి సూర్యప్రకాష్, మజ్జి బాబ్జి, మజ్జి నిరంజన్ కుమార్, షేక్ దర్గా జెర్రిపోతుల నూకునాయుడు, కోన నాగ సురేష్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని రామచంద్రపురం గ్రామం వద్ద శనివారం ప్రయాణికులతో వెళుతున్న ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఒమ్మి దేవుడు, ఒమ్మి రాములమ్మలను కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన ఒమ్మి చిన్న తల్లి, కె.బుజ్జి , బి.కృష్ణ, పి.లక్ష్మణలను స్థానిక సిహెచ్‌సికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులను టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహనాయుడు పరామర్శించారు.

వైసిపి ఓటమి ఖాయం

ప్రజాశక్తి -అచ్యుతాపురం

వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఘోరంగా ఓటమి చెందడం ఖాయమని ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని చీమలపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రట్ల ప్రజలు విసిగి చెంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సిఎం.రాజేష్, గ్రామ మాజీ సర్పంచ్ మామిడి శివ అప్పారావు, నూకరాజు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం కూటమి అభ్యర్థులు సుందరపు విజయ్‌కుమార్, సిఎం రమేష్‌లను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోను ఇంటింటికి ఇచ్చి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఏవి సత్యనారాయణ, కడియం అనురాధ, రేపాక మాలతి, సుందరపు ధనలక్ష్మి, బలిరెడ్డి శ్రీను, సుందరపు శివకృష్ణ, చిన్ని దేవి, సరగడం యోగి నాగేశ్వరరావు, మొల్లేటి ఆనంద్, పోలవరశెట్టి మురళి పాల్గొన్నారు.

గ్రంథాలయం రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం శాఖ గ్రంథాలయ రికార్డులను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్ వెంకటరమణ పరిశీలించారు. స్థానిక శాఖ గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డుల నిర్వహణ బాగునట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠకుల కోరిక మేరకు విద్యార్థులకు అనుకూలంగా కొత్త పుస్తకాలు తప్పకుండా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆయన కలిశారు. పరిశ్రమల ద్వారా రావలసిన సెస్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థకు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు వారం రోజుల్లో విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. చెక్ రూపంలో పంపిస్తామన్నారు. ఆతనితోపాటు అచ్యుతాపురం గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -అనకాపల్లి

నక్కపల్లి పోలీస్ స్టేషన్లో మహిళ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఉమెన్ పిసి డి.దుర్గాభవాని ఇటీవల మృతి చెందారు. భవాని తల్లి చంద్ర రాధకు అడిషనల్ కార్పస్ ఫండ్ నుండి లక్ష రూపాయల ఆర్థిక సహాయం కింద చెక్‌ను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ లో పని చేస్తూ మృతి చెందిన ఉమెన్ పిసి దుర్గ భవాని కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ బి.శారద, జూనియర్ అసిస్టెంట్ రోజా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

నత్త నడకన జల్ జీవన్ పనులు

పాములవాకలో అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో గడిచిన రెండు సంవత్సరాల క్రితం మొదలుపెట్టిన జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 23 కోట్లతో 25 గ్రామ పంచాయతీలకు గాను 71 పనులుగా గుర్తించి జరుగుతున్న పనులు నత్త నడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్మాణం చేపడుతున్న కాలనీ ఇళ్ల వద్ద అదే విధంగా కొన్ని గ్రామాల్లో గుర్తించిన చోట వాటర్ ట్యాంకులు నిర్మాణం జరుగుతున్నాయి. రాట్నాల పాలెం, రామన్నపాలెం, జి.ఎస్.ఆర్ పాలెం, నీళ్ల గుంట, బికేపల్లిలో వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేపట్టినా నేటికీ ఎక్కడ కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వం నిర్మిస్తున్న కాలనీల వద్ద వివిధ దశల్లో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే పూర్తయిన జరిగిన పైపులైను పనులు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల పైపులు నుండి లీకులు కావడంతో గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. నాసిరకంగా పైపులైన్లు పనులు జరుగుతున్నాయని పలు నేతలు తెలిపిన సందర్భాలు ఉన్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోటవురట్లలో నిరుపయోగంగా ఉన్న పైపులు

నిరసన చేపడుతున్న మహిళలు

హోటల్ కూల్చివేతపై నిరసన

ప్రజాశక్తి -కోటవురట్ల:గడిచిన 30 ఏళ్లుగా హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామని రాజకీయ నాయకులు ఉద్దేశపూర్వకంగానే రెవెన్యూ అధికారులతో శనివారం హోటల్ కూల్చి వేతకు పూనుకున్నారని హోటల్ నిర్వాహకురాలు పబ్బు మాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు, కోటవురట్ల మర్రిచెట్టు వద్ద కూల్చివేసిన హోటల్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను బాధితులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఇటువంటి ఆసాంఘిక కార్యక్రమాలకు రాజకీయాలు వేదిక కాకూడదని తెలిపారు. అదే వృత్తిపై ఆధారపడి బతుకుతున్న వారు ఎలా జీవించాలని తక్షణమే వారికి నష్ట నివారణ చర్యలు చేపట్టి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టిడిపిలో చేరిన పలు కుటుంబాలు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కంఠారం పంచాయతీకి చెందిన 20 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, మళ్లీ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనించాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు

రాష్ట్రంలో పరిశ్రమలు ఏవీ?

-మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ:వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా తీసుకు రాలేక పోయారని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. శనివారం సాయంత్రం మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడిలతోనే సాగి పోయిందన్నారు. మెజార్టీ ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా తీసుకువస్తానని ఎన్నికల ముందు చెప్పిన జగన్ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసేత్తలేదన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

-వైసిపి అభ్యర్థులు జోగులు, గణేష్

నర్సీపట్నంలో ప్రచారం చేస్తున్న గణేష్

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల, చిన తీనార్ల గ్రామాల్లో శనివారం పాయకరావుపేట నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జోగులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. ప్రభుత్వ పాలన దృష్టిలో పెట్టుకుని తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, నాయకులు సూరకాసులు గోవింద్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:అభివృద్ధి, సంక్షేమం వైసీపీతోనే సాధ్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 19వ వార్డు బయపురెడ్డిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో 30వేల మెజార్టీతో గెలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చినబాబు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, ప్రస్తుత వైస్ చైర్మన్ తమరాన నాయుడు, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏకాశివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మాజీ కౌన్సిలర్ వర్రే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లి మండలంలో చేపడుతున్న ప్రచారం

చేపడుతున్న పనులు

రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో గొలుగొండ మండలంలో తొమ్మిది నెలలుగా నిలిచిన ఆరిలోవ అటవీ ప్రాంతం రోడ్డు నిర్మాణ పనులు పున: ప్రారంభించారు. నర్సీపట్నం- కృష్ణదేవిపేట రోడ్డు విస్తరణ పనులు జరగక పోవడంతో అనేక సంవత్సరాలుగా ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ తరుణంలో పనులు ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో తొమ్మిది నెలలుగా పనులను నిలిపివేశారు. అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్‌కు కొంత చేయూత అందించి రోడ్డు విస్తరణ పనులను ఆదరాబాదరాగా పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

పెట్రోల్ బంక్ వద్ద వేచివున్న వాహనదారులు

హుకుంపేటలో భారీ వర్షం

-అవస్థలు పడ్డ వాహనదారులు

ప్రజాశక్తి-హుకుంపేట:-శనివారం భయంకరమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి శనివారం వారపు సంతకు వచ్చిన వారంతా పెట్రోల్ బంక్ వద్ద తలదాచుకున్నారు. రెండు గంటలసేపు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది.

పోలీసుల సహకారంతో పరీక్షకు హాజరు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని 6 పాఠశాలల విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ నిమిత్తం శనివారం నర్సీపట్నం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు పంపించామని సిఐ రమేష్, ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో ఇక్కడ ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో సెలెక్ట్ అయిన వారికి ఆన్లైన్ చేయించి పోలీసుల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సుల్లో వారిని ఇద్దరు పోలీసులు సహాయంతో తరలించారు. అనంతరం భోజన సదుపాయం ఏర్పాటు చేసి తిరిగి తీసుకు వచ్చామని తెలిపారు.

పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

షర్మిల సభకు తరలి వెళ్లిన సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో షర్మిలకు స్వాగతం పలికి అరకులోయలో నిర్వహిస్తున్న సభకు సిపిఎం శ్రేణులు తరలి వెళ్లారు.ముందుగా అరకు వారపు సంతలోని నారింజ వలస గ్రామంలో ఆ పార్టీ నాయకులు గడపగడపకు కర పత్రాలను పంపిణీ చేశారు. నాయకులు ఆర్.రాము, మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు, పి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార రోడ్డు షోలో పాల్గొన్న కెకె.రాజు, బొత్స ఝాన్సీ

ఆక్సిజన్ టవర్స్‌లో కెకె.రాజు ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్ సమీపంలోని ఆక్సిజన్ టవర్స్‌లో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో నియోజకవర్గం పరిధిలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు.

సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్ బిఎస్.లే-అవుట్‌లో కెకె.రాజు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ ప్రచారం నిర్వహించారు.

జిమ్‌ల సందర్శన

అక్కయ్యపాలెంలోనిమారుతి జిమ్, మోహన్ జిమ్, జగ్గారావు బ్రిడ్జ్ సమీపంలోని ఇండియన్ జిమ్, సీతమ్మధారలోని ఎబిఎస్ జిమ్‌లను కెకె.రాజు సందర్శించారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌సింగ్, రేవతిరావు, ఎం.సునీల్, అంబటి శైలేష్, రాయుడు శ్రీను, పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

జివిఎంసి 47వ వార్డు పరిధి కంచరపాలెం బాపూజీ నగర్‌కు చెందిన పలువురు బిజెపి శ్రేణులు కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. వీరికి కెకె.రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. వైసిపిలో చేరిన వారిలో కేబుల్ గోవింద్‌రెడ్డి, మక్కా శివ, జి.నాని, కె.ఆదిలక్ష్మి, కె.అనితాదేవి, జి.ఎల్లయమ్మ, రామతల్లి, అచ్చియమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో సిపిఎం విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక : ఇండియా ఫోరం బలపర్చిన గాజువాక నియోజవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు శనివారం కొండవాలు ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుందరయ్యకాలనీ, దుర్గానగర్, అరుణోదయ కాలనీ, గుడివాడ గురునాధరావు కాలనీ, దిబ్బపాలెం, శ్రీనగర్, శ్రీరామ్‌నగర్, ఆఫీసర్స్ కాలనీ, కర్ణవానిపాలెం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారంలో పాల్గొన్న సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడుకు కొంతమంది మహిళలు భారీ ఎత్తున పువ్వులు జల్లి స్వాగతం పలికారు. మరికొన్ని ప్రాంతాల్లో హారతులిచ్చారు. సిపిఎం గుర్తు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటువేయాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, సిపిఎం పోరాట ఫలితంగానే సుందరయ్యకాలనీ, అరుణోదయ కాలనీలతో పాటు మరిన్ని కాలనీలు ఏర్పడిన విషయాన్ని గుర్తుచేశారు. అద్దె ఇళ్లలో ఉన్న వారికి స్థలాలు వచ్చేలా కృషిచేస్తానని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం సిపిఎం పోరాడుతోందని, ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎస్.కృష్ణ, డి.శ్రీను, ఎస్.శ్రీను, ఎస్.లక్ష్మి, ఎస్‌వికె.పరశురాం, ఎన్.రాజేంద్రప్రసాద్, డాక్టర్ రమేష్‌కుమార్, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.

72 వార్డులో

జివిఎంసి 72వ వార్డు పరిధిలో ఎం.జగ్గునాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 72వ వార్డు సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, గాజువాక కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వెంకటరమణ, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు ఆనంద్, విష్ణు, ఎం.రాంబాబు, పరశురాం, ప్రసాద్, బి.ప్రభావతి, ఎస్.కృష్ణ, ఎస్.శ్రీను పాల్గొన్నారు

69వ వార్డులో...

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు గెలుపు కోరుతూ 69వ వార్డు పరిధి షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, జగ్గయ్యపాలెం మార్కెట్‌లో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచారంలో వై.సత్యవతి, ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

72వ వార్డులో ప్రచారంలో జగ్గునాయుడుతోపాటు ఇండియా ఫోరం నేతలు

'పశ్చిమం'లో ఆడారి ప్రచారం

ఇంటింటి ప్రచారంలో ఆడారి మాలతి, బెహరా భాస్కరరావు తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : ఒక్క అవకాశం ఇస్తే పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. జివిఎంసి 61వ వార్డు పరిధిలోని కాలనీల్లో కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యాన శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, మాట ఇస్తే మడమ తిప్పనన్నారు. ఈ కార్యక్రమంలో 61వ వార్డు వైసిపి నాయకులు దాడి సత్యనారాయణ (డిపో), ఎన్‌వి.రమణ, చట్టి నూకరాజు, కొల్లు నూకరెడ్డి, మంగవేణి, లలిత పాల్గొన్నారు.

92వ వార్డులో ప్రచారం..

గోపాలపట్నం : ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి ఆడారి మాలతి శనివారం జివిఎంసి 92వ వార్డు పరిధి ఎస్‌సి, బిసి కాలనీలో బెహరా భాస్కరరావుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనంద్‌కుమార్‌ను గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు వైసిపి అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

ఎన్నికల సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగత్

వివిధ రాజకీయ ప్రతినిధులు, ఆర్ఓల సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు దల్జిత్ సింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో అన్ని స్థాయిలలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగత్ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పూర్తి పారదర్శకంగా ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ జరిపేందుకు కృషి చేయాలన్నారు. ఓటర్లు ఉత్సాహంగా నిర్భయంగా ఎక్కువ శాతం పోలింగ్లో పాల్గొనేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పార్టీలన్నీ బిఎల్ఏలను శతశాతం నియమించాలన్నారు. వివిధ విభాగాలు నిర్వహిస్తున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, వీవీప్యాడ్‌లపై ఏమైనా సందేహాలుంటే చెప్పాలన్నారు. నగదు తనిఖీలలో భాగంగా బ్యాంకు వాహనాలు, అంబులెన్స్‌లను కూడా తనిఖీ చేయాలని సూచించారు. ప్రచారంలో శబ్ద కాలుష్యంపై లేవనెత్తిన అంశాన్ని పురస్కరించుకొని నిర్దేశిత పరిమాణం 80 డెసిబల్స్ కంటే ఎక్కువగా సౌండ్‌తో ముఖ్యంగా డి.జె. సౌండ్ ప్రచారవాహనాలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముందుగా జిల్లా కలెక్టరు జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి జిల్లా స్వరూప స్వభావాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, ఓటర్ల వివరాలను, నిబంధనల అతిక్రమణలపై చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు, ఇప్పటి వరకు పట్టుబడిన అక్రమ మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను గూర్చి తెలిపారు. అనంతరం పరిశీలకులు ఎన్నికల విభాగాలైన కమాండ్ కంట్రోల్ రూమ్, ఎంసిఎంసి, ఎంసిసి వీడియో వీవింగ్, మీడియా విభాగాలను పరిశీలించారు. ఈ సమావేశంలో జనరల్ అబ్జర్వర్ డాక్టర్ రాకేష్ కుమార్ కె.మోహన్ ఎం.దహికర్, జాయంట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్.వి.జయరామ్, అసెంబ్లీల రిటర్నింగ్ అధికారులు కె.గీతాంజలి, బి.వి.సత్యవాణి, కె.మనోరమ, వి.శేషశైలజ, ఎస్.డి.సి. సుబ్బలక్ష్మి, ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు వి.ప్రసాదు, సత్యనారాయణ, జివి లక్ష్మి, డియంహెచ్‌వో డాక్టర్ ఏ హేమంత్, సిపివో జి.రామారావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.తాతయ్యబాబు (టిడిపి), జి.చిన్నారావు (బిఎస్‌పి), కె.హరనాధబాబు (ఆమ్‌ఆద్మీ), అల్లురాజు, గంటా శ్రీరామ్ (సిపిఎం) గొర్లె సూరిబాబు (వైసిపి), వి.రమేష్ (బి.జె.పి.) పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న డిటిపై చర్యలు తీసుకోవాలి

-రాజకీయ పార్టీల సమావేశంలో సిపిఎం విజ్ఞప్తి

-మినిట్స్‌లో నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రీ సర్వే పేరుతో రికార్డుల్లో భూములు తారుమారు చేసి, ఒక రాజకీయ పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్న అనకాపల్లి డిప్యూటీ తహశీల్దారు ఎలమంచిలి శ్రీరామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో శనివారం జరిగిన ఎన్నికల సమావేశంలో గంట శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఈ నెల రోజుల్లోనే భూముల రీ సర్వే పేరుతో కొత్తగా ఎల్‌పి నెంబర్లు కేటాయించి ఒక రాజకీయ పార్టీ నాయకులకు లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామ ఖాతా నెంబర్ 1255లో, సర్వే నెంబర్ 134/23లోని 0.68 సెంట్లు భూమిని దాకారపు శ్రీనివాసరావు (తండ్రి వెంకటరమణ (లేటు)) పేరుతో ఉందని తెలిపారు. ఈ భూమిని ఈ ఏడాది మార్చి 26వ తేదీ తర్వాత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత అధికారులు అందరూ ఆ పనిలోవుండగా అనకాపల్లి డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్మూర్తి, పిసినికాడ సచివాలయం సర్వేయర్, విఆర్ఒ కలిసి రీ-సర్వే పేరుతో నూతనంగా ఎల్‌పి నెంబర్ 884 పేరుతో 0.68సెంట్లుకు బదులుగా 0.3480 సెంట్లు భూమిగా చూపించి, 0.34 సెంట్లు తగ్గించడం జరిగిందని తెలిపారు. ఇవే పరిస్థితులు మండలంలో ఉన్నాయన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో కూడా ఇదే విధంగా చేస్తున్నారని చెప్పారు. డిటి శ్రీరామ్మూర్తి ఒక రాజకీయ నాయకుడుతో దిగిన ఫొటో తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారని, ఈ మధ్యనే దాని తొలగించారని చెప్పారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ దీనిని మినిట్స్‌లో నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిపిఎం ఆఫీసు కార్యదర్శి ఎం.రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు డిజె సౌండ్ ఎక్కువగా పెట్టడం వలన సౌండ్ పొల్యూషన్‌తో పాటు ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని, దీని పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపైన కూడా తగు చర్యలు తీసుకోవాలని ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించడం జరిగింది.

పకడ్బందీగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష పకడ్బందీగా శనివారం నిర్వహించారు. ఈ సెంటర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 157 మంది హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రవేశ పరీక్ష రాశారు. పాఠశాల ప్రిన్సిపల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగిందని చెప్పారు. తీవ్ర వేసవిలో కూడా సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల్లో ఈ స్పందన చూస్తుంటే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి భారీగా ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తుందన్నారు. హాజరైన విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, తాగునీరు, మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందని చెప్పారు.